సాక్షి
నల్లగొండ
సోమవారం ❘ 11 ❘ మార్చి ❘ 2024





**ముగిసిన శివరాత్రి ఉత్సవాలు**
యాదాద్రి శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. - 8లో



**పోచంపల్లి పట్టు వస్త్రాలు**
యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. - 8లో



**ఉత్కంఠగా ఎద్దుల పందేలు**
మేళ్లచెరువు జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు ఆదివారం ఉత్కంఠగా సాగాయి. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు రౌండ్ టేబుల్ సమావేశం

రామగిరి(నల్లగొండ) : యునైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతి సంయుక్తంగా బీసీల హక్కుల సాధనకై ఈనెల 11న నల్లగొండలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు భారత జాగృతి జిల్లా కన్వీనర్ భోనగిరి దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి బీసీ, కుల సంఘాల నాయకులు, వివిధ హోదాలో ఉన్న నాయకులు రౌంట్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

### 12న సాగర్‌లో నేచర్ క్యాంపు

నల్లగొండ : జిల్లాలో ఐదు పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులకు ఈ నెల 12 నుంచి పర్యావరణ అధ్యయనంపై నాగార్జునసాగర్‌లో నేచర్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు డీఈఓ భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 14వ తేదీ వరకు అవగాహన క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి (9848578845)ని సంప్రదించాలని సూచించారు.

### బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

నల్లగొండ : ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగుబెల్లి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరాం కోరారు. నల్లగొండలోని తపస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యనిర్వాహక సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రమోషన్లపై కోర్టులో స్టే ఉందని అది వెకేట్ అయ్యే అవకాశం ఉన్నందున వెంటనే జీఓ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి భిక్షపతి, తులసి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శంకరాచారి, అమృతారెడ్డి, మల్లికార్జున్, సుధాకర్, వేణు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### చెర్వుగట్టులో లక్ష పుష్పార్చణ


లక్ష పుష్పార్చన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం ఆదివారం రాత్రి భక్తులతో కిక్కిరిసింది. అమావాస్య కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతల నుంచి భక్తులు సాయంత్రం నుంచే పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమావాస్య రాత్రి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సతీష్‌శర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేద మంత్రాలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ సిబ్బంది, పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

### పచ్చల సోమేశ్వరాలయంలో అగ్ని గుండాలు


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పానగల్లు పచ్చల సోమేశ్వరాలయంలో ఆదివారం ఉదయం అగ్నిగుండాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు నవీన్‌శర్మ, కృష్ణలతేజశర్మ తదితరులు పాల్గొన్నారు.

# పండ్ల తోట.. గుండె కోత!


గుర్రంపోడు మండల పరిధిలో కట్టవారిగూడెం సమీపంలో వాడుపట్టిన బత్తాయి తోట



ఈ ఫొటోలోని రైతు నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన వారణాసి రవికాంత్. ఈ రైతుకు ఏడేళ్ల వయస్సు ఉన్న ఏడెకరాల బత్తాయి తోట ఉంది. రూ.10 లక్షల విలువైన బత్తాయి కాయలు చెట్లపైన ఉన్నాయి. మరో నెల రోజులైతే బత్తాయి కోయాల్సి ఉంది. తోటలో ఉన్న బోరు ఎండిపోయింది. నీరు అందక చెట్లపైన ఉన్న బత్తాయి కాయలు మెత్తబడుతున్నాయి. తోట మొత్తం వాడుబట్టింది. తోటను కాపాడుకునేందుకు వారం రోజుల వ్యవధిలో 24 బోర్లు వేశాడు. ఒక్క దాంట్లో కూడా చుక్క నీరు రాలేదు. కొన్ని 450 ఫీట్ల లోతు వేసినా ప్రయోజనం లేదు. బోర్ల కోసం రూ.3 లక్షలు ఖర్చు చేశాడు. సమీప రైతుల నుంచి నీరు కొనుగోలు చేద్దామన్నా.. వారి కూడా బోర్లు పోయడం లేదు. ఇప్పుడు ఏం చేయాలో పాలుపోక ఈ రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

- వర్షాభావంతో ఎండుతున్న పండ్ల తోటలు
- భూగర్భ జలాలు పడిపోయి వట్టిపోతున్న బోర్లు
- వేసవి గండం గట్టెక్కేదెలా అని రైతుల ఆందోళన
- తోటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు
- వరికి వదిలేసి తోటలకు నీరు పెడుతున్న రైతులు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం

గుర్రంపోడు, నల్లగొండ రూరల్ : పండ్ల తోటలు ఈ ఏడాది రైతులకు గుండెకోత మిగిల్చుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోయి తోటలకు నీరందడం లేదు. దీంతో పలు చోట్ల తోటలు ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల వాడుపట్టాయి. ప్రధానమైన పండ్లతోటలు అన్నీ వేసవిలోనే దిగబడులు ఇచ్చే సమయం కావడం.. ఇప్పుడు నీరందకపోవడంతో దిగుబడి, నాణ్యత తగ్గిపోనుంది. బత్తాయి తోటల్లో మరో 40 రోజుల్లో కాయలు చేతికొస్తాయి ఈ దశలో సరిపడా నీరు లేకపోవడంతో కాయలు చెట్టుమీదనే మెత్తబడిపోతున్నాయి. సాధారణంగా వరి, ఇతర మెట్ట, వాణిజ్య పంటలపై కరువు ప్రభావం స్వల్పకాలంగా ఉంటుంది. పండ్లతోటలు మాత్రం మొక్క నాటిన ఐదారేళ్ల వరకు పెట్టుబడులు పెట్టి ఆ తర్వాత 20 ఏళ్ల పాటు దిగుబడు ఇస్తాయి. ఈ పరిస్థితిలో తోటలు ఎండిపోతే నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారు సాగు చేసిన వరి చేలను వదిలేసి.. తోటలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**ముశంపల్లి చెరువులో 25 బోర్లు..**

నల్లగొండ మండలంలోని ముశంపల్లి చెరువు 199 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువులో గ్రామానికి చెందిన పెద్ద రైతులు రాత్రివేళలో పది రోజుల వ్యవధిలోనే 25 బోర్లు వేసి ఐదు కిలోమీటర్ల దూరం వరకు పైపులైన్ ద్వారా నీళ్ల తీసుకెళుతున్నారు. చెరువులో బోర్లు వేయడంతో చుట్టూ భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. దీంతో చిన్న, సన్నకారు రైతులకు నీటి ఎద్దడి మరింత పెరిగింది. గ్రామంలో ఉన్న స్కీమ్ బోర్లు కూడా వట్టిపోతున్నాయి.

**జిల్లాలో పండ్లతోటలు ఇలా..**

| తోట | ఎకరాలు |
|---|---|
| బత్తాయి | 45,000 |
| నిమ్మ | 11,000 |
| మామిడి | 2,500 |
| డ్రాగన్ ఫ్రూట్ | 400 |
| ఆయిల్‌పాం | 7,750 |

**నీటి ఎద్దడితోనే పండ్ల తోటలకు తెగులు**

పండ్ల తోటల్లో నీటి ఎద్దడి కారణంగా దిగుబడులు తగ్గడంతోపాటు తెగులు సోకుతున్నాయి. ప్రధానంగా బత్తాయి, నిమ్మ జాతి తోటల్లో వేరు కుళ్లు తెగులు సోకుతోంది. ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు ఈ తెగులు వ్యాపించి క్రమంగా తోట మొత్తం ఎండిపోతుంది. నీటి ఎద్దడి నుంచి పండ్లతోటలను కాపాడుకునేందుకు తేమ పోకుండా పాదులను వరిపొట్టుతో కప్పి ఉంచడం, సున్నం నీటిలో కలిపి చెట్టుపై పిచికారీ చేస్తే పొరలాగా ఏర్పడి చెట్టుపై సూర్యరశ్మి తీవ్రత తగ్గేలా చేస్తుందని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**తోట ఎండిపోతుంటే బాధగా ఉంది**



నాలుగు ఎకరాల బత్తాయి తోటను కాపాడుకునేందుకు ఐదు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. బోరు వట్టిపోవడంతో తోట నిలువునా ఎండుతోంది. పక్క రైతుల నుంచి నీరు కొనుక్కుని తోటను కాపడుకుందామనుకున్నా సమీపంలో బోర్లు లేవు. దీంతో కాపుకు వచ్చిన నాలుగేళ్ల బత్తాయి తోటలోని 300 మొక్కలు నిలువునా ఎండిపోతుంటే బాధగా ఉంది. తోట సాగుకు ఇప్పటి వరకు ఖర్చుచేసిన నాలుగు లక్షల రూపాయలు నష్టపోయా.

– మారగోని నర్సింహ, కట్టవారిగూడెం

**తోట కోసం వరి చేను వదిలేశా..**



నాకు బత్తాయి, నిమ్మ తోటలో దిగుబడి ఉంది. తోటలను కాపాడుకునేందుకు వరి చేను వదిలేశాను. తోట ఎండిపోతే ఆర్థికంగా వెనుకబడటంతో పాటు మళ్లీ తోట పెట్టి సాగు చేయాలంటే ఐదేళ్లపాటు వేచి చూడాలి. వరి చేను ఎండిపోయినా సరే.. తోటను బతికించుకుంటే చాలని ఆరు బోర్లు వేశాను. ఒక్కదాంట్లో కొద్దిగా నీరు పడింది. ఇందుకోసం రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు.

– చిర్ర వెంకట్‌రెడ్డి, గుట్టకిందిఅన్నారం

**వట్టిపోయిన బోర్లు.. రైతుల అష్టకష్టాలు**

వర్షాభావంతో బోర్లు వట్టిపోతుండటంతో తోటలకు నీరందించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ విన్నా బోర్లు వేస్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. ఏఎమ్మార్పీ ఆయకట్టు మండలాల్లోనూ కుంటలు, చెరువుల్లో చుక్కనీరు లేకుండా పోయింది. గతంతో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నప్పుడు కూడా బావులు, బోర్లలో కొద్దిపాటి నీరైనా ఉండేది. ఇప్పుడు బోర్లు బాగా పెరగడంతోపాటు 24 గంటల కరెంట్ కారణంగా భూగర్భ జలాలు అడుగంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.


ముశంపల్లి చెరువులో వేసిన బోర్లు

బత్తాయి తోటలు సాగుచేస్తున్న గుర్రంపోడు, పీఏపల్లి, కనగల్, నల్లగొండ, తిప్పర్తి మండలాల్లో బోర్లు ఎక్కువగా వేస్తున్నా నీళ్లు రాక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. తోటలను ఎలాగైనా కాపాడుకోవాలని అప్పులు చేసైనా బోర్లు వేయడం, కిలోమీటర్ల కొద్దీ పైపులైన్లు వేయడం, ట్యాంకర్లతో నీరందించడంలో రైతులు నిమగ్నమయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్లు వేసి తోటలకు నీరందిస్తున్నారు. తోటలు ఎండిపోవడం, దిగుబడులు తగ్గడం కారణంగా రైతులు రూ.200 కోట్ల మేరకు నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి


దేవరకొండలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే బాలునాయక్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

దేవరకొండ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని డిండి చౌరస్తా నుంచి మైనంపల్లి బ్రిడ్జి వరకు రూ.14 కోట్లతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులకు ఆయన ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలో గల పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయించి ఉంటే పాలమూరు, నల్లగొండ జిల్లాలకు కరువు ఉండేది కాదన్నారు. శ్రీశైలం సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో మొత్తం రూ.40 కోట్లతో రోడ్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆవాసాలు, తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా మంత్రుల సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, రోడ్లు భవనాల శాఖ ఎస్‌ఈ రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, పార్వతి, రేఖశ్రీధర్‌రెడ్డి, జాల నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, బుజ్జి, శోభారాణి, ఏవిరెడ్డి, వేణుధర్‌రెడ్డి, ధనలక్ష్మీబాలనారాయణ, శ్రీశైలం యాదవ్, యూనూస్ పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్‌కు షాక్

- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి
- ఆ పార్టీ నుంచి ఎంపీగా అవకాశం దక్కేనా?


సైదిరెడ్డికి బీజేపీ సభ్యత్వం అందజేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్‌కు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరారు. ఢిల్లీలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సమక్షంలో ఆదివారం కాషాయం కండువా కప్పుకున్నారు. గతంలో కొన్ని సంవత్సరాలపాటు కెనడాలో హోటల్ వ్యాపారం చేసిన సైదిరెడ్డి 2018 ఎన్నికలకు ముందు హుజూర్‌నగర్‌కు వచ్చారు. అప్పట్లో టీఆర్‌ఎస్‌లో చేరి అదే సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతిలో సైదిరెడ్డి ఓడిపోయారు. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఉత్తమ్ 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా గెలుపొందడంతో హుజూర్‌నగర్‌లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పద్మావతిరెడ్డి.. టీఆర్‌ఎస్ నుంచి మళ్లీ శానంపూడి సైదిరెడ్డి పోటీ చేశారు. ఉప ఎన్నికల్లో సైదిరెడ్డి గెలుపొందారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ నుంచి సైదిరెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఉత్తమ్ భారీ విజయ సాధించగా సైదిరెడ్డి ఓటమి పాలయ్యారు. తాజాగా సైదిరెడ్డి బీజేపీలో చేరారు. నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తుందన్న ఆలోచనతోనే సైదిరెడ్డి బీజేపీలో చేరినట్లు తెలుస్తోంది. బీజేపీకి కూడా నల్లగొండలో బలమైన నాయకుడు లేకపోవడంతో సైదిరెడ్డిని పోటీలో నిలిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# జీవితంలో పెద్ద లక్ష్యం నిర్దేశించుకోవాలి

- కలెక్టర్ హరిచందన


మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : విద్యార్థినులు జీవితంలో పెద్ద లక్ష్యం నిర్దేశించుకోవాలని కలెక్టర్ హరిచందన సూచించారు. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని గంధంవారిగూడెం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన ప్రేరణ తరగతులకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే అందుకు తగిన కృషి ఉండాలన్నారు. పరీక్షలంటే భయం తొలగించుకోవాలని సూచించారు. జీవితంలో అనుకున్నది సాధించేందుకు రెండు లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒకటి జీవిత లక్ష్యం, రెండోది పరీక్షలకు సంబంధించిన లక్ష్యమన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ చందనాదీప్తి, డీఐజీ రవిగుప్త భార్య అంజలీగుప్త, ఆర్‌సీఓ హెచ్.అరుణకుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ లలితకుమారి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సావిత్రీబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త


సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు పేర్కొన్నారు. ఆదివారం సాయిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా నల్లగొండలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే 180 సంవత్సరాల క్రితమే సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో కాసోజు విశ్వనాథం, నల్ల సోమమల్లయ్య, కేశబోయిన శంకర్ ముదిరాజ్, నకిరెకంటి కాశయ్య గౌడ్, చిక్కుళ్ల రాములు, ఆదినారాయణ, గుండా కోటప్ప, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవ శోభ

**నేటినుంచి యాదాద్రి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు**

- ఉదయం విశ్వక్సేన ఆరాధన, స్వస్తీవాచనంతో శ్రీకారం
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


విద్యుత్ వెలుగుల్లో యాదాద్రి ఆలయం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తీవాచనం, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టనున్నారు. 21న అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో పరిసమాప్తి కానున్నాయి. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను పాంచరాత్ర ఆగమ సిద్ధాంతానుసారంగా, సంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారు.

**బ్రహ్మోత్సవాల షెడ్యూల్**

- 11వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తీవాచనం, రక్షాబంధనం, సాయంత్రం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణ.
- 12న ఉదయం 8గంటలకు అగ్నిప్రతిష్ఠ, 11గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6.30కి భేరీపూజ, దేవతాహ్వానం, హవన పూజలు
- 13న ఉదయం 9గంటలకు మత్స్యావతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7గంటలకు శేష వాహన సేవ నిర్వహిస్తారు.
- 14న ఉదయం 9గంటలకు వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి 7గంటలకు హంస వాహన సేవ.
- 15న ఉదయం 9గంటలకు శ్రీకృష్ణ (మురళీ కృష్ణుడు) అలంకార సేవ, రాత్రి 7గంటలకు పొన్న వాహన సేవ.
- 16న ఉదయం 9 గంటలకు గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి 7గంటలకు సింహ వాహన సేవ.
- 17న ఉదయం 9గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 8.45కు శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం.
- 18న ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై శ్రీస్వామిని ఊరేగింపు, రాత్రి 8.45గంటలకు గజవాహన సేవ, శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణం నిర్వహిస్తారు.
- 19న ఉదయం 9 గంటలకు శ్రీమహావిష్ణు అలంకార సేవలో గరుడ వాహనంపై శ్రీస్వామివారి ఊరేగింపు, రాత్రి 8.45కు దివ్య విమాన రథోత్సవం.
- 20న ఉదయం మహా పూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, రాత్రి 7 గంటలకు శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం.
- 21న ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.


సీఎం రేవంత్‌రెడ్డి

**ఉత్తర మాడ వీధిలో కల్యాణం**

ప్రధానాలయ ఉత్తర మాఢవీధిలో కల్యాణ వేడుక నిర్వహించనున్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.3,000 చెల్లించి టికెట్ తీసుకోవలసి ఉంటుంది.

**ప్రథమ ప్రాకారంలో సేవల అలంకరణలు**

బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన అలంకార, వాహన సేవలు ఆలయ ప్రథమ ప్రాకారంలో నిర్వహించనున్నారు. ఉత్తర దిశలో ఉన్న మండపంలో శ్రీస్వామి వారిని అలంకరించి సేవలను ఉత్తర రాజగోపురం నుంచి మాడవీధుల్లో ఊరేగిస్తారు. పశ్చిమ రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన వేంచేపు మండపం వద్ద శ్రీస్వామి వారి అలంకార సేవను అధిష్ఠించి ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు పారాయణాలు పఠిస్తారు. భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు 15నుంచి 21వ తేదీ వరకు ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**11 రోజులు సంప్రదాయంగా ఉత్సవాలు**



యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు పాంచరాత్ర ఆగమశాస్త్ర అనుసారంగా నిర్వహిస్తాం. శ్రీస్వామిని ఇష్టమైన అలంకార, వాహన సేవలు ఈ నెల 13వ తేదీన ప్రారంభం అవుతాయి. ప్రధాన ఘట్టాలైన ఎదుర్కోలు ఉత్సవం తూర్పు రాజగోపురం ముందు, కల్యాణం ఉత్తర మాఢ వీధిలో నిర్వహిస్తాం. రథోత్సవం రోజు శ్రీస్వామి వారు ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగుతారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలి.

–కాందూరి వెంకటచార్యులు, ప్రధానార్చకులు

**బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం**


బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు రూ.1.60కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులందరికీ ఆహ్వాన పత్రికలు అందజేశామని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ 1500 మందికి అన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. రోజూ 15వేలకు పైగానే భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎదుర్కోలు, కల్యాణం, రథోత్సవం రోజుల్లో 30వేలకు పైగా భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. 70 మందికి పైగా ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు రానున్నారని స్పష్టం చేశారు. ఎంతమంది భక్తులు వచ్చినా కొరత రాకుండా లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, బస్సుల ఏర్పాటు తదితర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయంలో రోజూ నిర్వహించే ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### మహిళలకు రక్షణ కరువు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నల్లగొండటౌన్: బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. ఆయన ఆదివారం డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చేయలేదన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మణిపూర్లో మహిళల పైన దాడులు దౌర్జన్యాలు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, గుండాల నరేష్, రామకృష్ణ ,సంతోష్ ,శేఖర్, రాము, శ్రావణ్ ,కిరణ్, కార్తీక్ పాల్గొన్నారు.

### విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఓ లారీ అదుపుతప్పి డివైడర్ ఎక్కి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి ప్రాంతం నుంచి పంచదార లోడ్‌తో లారీ ఒడిశాకు బయలుదేరింది. మార్గమధ్యలో ఆదివారం తెల్లవారుజామున కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని విలేకరుల కాలనీ సమీపంలో డివైడర్ ఎక్కి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగిపోయింది. ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తెలిసింది. ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాలేదు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలంలో ఆదివారం జరిగింది. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన శివరాత్రి సత్యనారాయణ (58) నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో ఆదివారం నీళ్లు కొడుతున్నాడు. ఈ క్రమంలో తేలి ఉన్న కరెంట్ వైరు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించడంతో అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివరాత్రి లింగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం పరిసరాల్లో ఓ వృద్ధుడు మృతిచెందాడు. గట్టుపై గౌరీ సదన్ వద్ద ఆదివారం ఓ వృద్ధుడు విగతజీవుడిగా ఉండడాన్ని ఆలయ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతడి వద్ద ఆధారాలు లేక పోవడంతో భిక్షాటన చేసుకుంటూ గట్టుపైన జీవనం సాగించేవారుగా గుర్తించినట్లు తెలిపారు. దాదాపు (70 ) వయస్సు ఉంటుందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.


### భార్య మృతిని తట్టుకోలేక..

- భర్త ఆత్మహత్యాయత్నం

భువనగిరి క్రైం : భార్య మృతుని తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన అడ్డగూడూరులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం చీమలకొండూర్ గ్రామానికి చెందిన పల్లెర్ల జమాల్ కుతూరు భూమిక (19), ఇదే గ్రామానికి చెందిన బిట్కూరి వెంకటేశ్ కుమారుడు మనోహర్ ప్రేమించుకుని ఇటీవల వివాహం చేసుకున్నారు. కుటుంబంలో గొడవలు జరగడంతో ఇటీవల భూమిక పుట్టింటికి వెళ్లి ఈ నెల 7వ తేదీన ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు భూమిక మృతదేహాన్ని భర్త మనోహర్ ఇంటి ముందు ఉంచి ధర్నా నిర్వహించారు. అప్పటికే భయాందోళనతో మనోహర్, కుటుంబ సభ్యులు అడ్డగూడూరులో నివాసముంటున్న సోదరి ఇంటికి వెళ్లారు. భార్య మృతుని జీర్ణించుకోలేక పోయిన మనోహర్ శనివారం రాత్రి సోదరి ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని తిరుమలగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. చిమలకొండూరులో ఆదివారం పోలీస్ బందోబస్తు నడుమ భూమిక అంత్యక్రియలు పూర్తి చేశారు.

# సీఎం గారు.. యాదగిరిగుట్టకు నిధులు ఇవ్వండి

- నిధుల లేమితో నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- వసతులు లేక భక్తుల ఇబ్బందులు
- నిర్వాసితులకు అందని పరిహారం
- నేడు బ్రహ్మోత్సవాలకు రానున్న రేవంత్‌రెడ్డి
- ఆశలు పెట్టుకున్న భక్తులు


యాదాద్రి కొండ కింద అసంపూర్తిగా నిలిచిన పనులు

సాక్షి, యాదాద్రి : యాదగిరిగుట్ట అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. యాదగిరిగుట్ట ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం ఆయన రానున్నారు. సీఎం అయిన తర్వాత తొలిసారిగా యాదగిరిగుట్టకు వస్తుండడంతో వరాల జల్లు కురిపిస్తారన్న ఆశతో భక్తులు ఉన్నారు. రూ.1,200 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి కావడానికి ఇంకా రూ.150 కోట్ల వరకు అవసరం ఉన్నాయి. నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. వైటీడీఏ ద్వారా యాదాద్రి అభివృద్ధి పనులను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. గత సంవత్సరం మార్చిలో ఆలయ ఉద్ఘాటన జరిగింది. రెండు సంవత్సరాలు కావొస్తున్నా భక్తులకు సరైన వసతులు లేవు.

**నిలిచిపోయిన పనులు**

వైటీడీఏలో పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం అవుతోంది. ప్రస్తుతం చేసిన పనులకు పాత బిల్లులు రూ.70 కోట్ల వరకు, కొనసాగుతున్న పనులను పూర్తి చేయడానికి రూ.70 కోట్ల మేరకు అవసరం అవుతాయి. ఇందులో రూ. 60 కోట్ల మేరకు పనులకు చెక్‌లు ఇవ్వగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దేవస్థానం బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్స్, ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు మధ్యలో నిలిచిపోయాయి.గిరి ప్రదర్శన మార్గం పనులు సగభాగంలోనే నిలిచిపోయాయి.

**వ్యాపారులకు నష్టం**


యాదగిరిగుట్ట పట్టణంలో రోడ్డును అవసరం లేకున్నా ఎక్కువ ఎత్తుతో బ్రిడ్జి నిర్మించి పట్టణాన్ని రెండుగా విడగొట్టి రూపురేఖలను చెడగొట్టారని విమర్శలు ఉన్నాయి. దీంతో రోడ్డుకు ఇరుపక్కల వ్యాపారాలు చేసే వారు వీధిన పడ్డారు. స్థానికులు పెద్ద ఎత్తున నష్టపోయారు. వీరి కోసం దేవస్థానం నిర్మించి ఇచ్చే షాపింగ్ కాంప్లెక్స్ పనులు కొనసాగుతున్నాయి.

**కొండపైన విశిష్టత కాపాడాలని..**

స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక విశిష్టత లేకుండా పోయింది. కొండపైన దీక్షాపరుల మండపం, డార్మిటరీహాల్, విష్ణుపుష్కరిణి, కల్యాణకట్ట ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దీంతోపాటు ఆలయం లోపలికి వెళ్లి తిరిగి వచ్చే భక్తులు నిలువ నీడ, సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పెద్దగుట్టపై ప్రారంభం కాని గెస్ట్ హౌస్‌లు**

పెద్దగుట్ట టెంపుల్ సిటీలో దాతల సహాయంతో చేపట్టాలిస్న గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలు నేటికీ ప్రారంభం కాలేదు. రూ.250 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేసిన లేఅవుట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.


నిలిచిపోయిన రెండో ఘాట్‌రోడ్డు పనులు

**స్థానికులకు ఉపాధి దూరం**

ఆలయ అభివృద్ధిలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం, ఇళ్ల స్థలాలు ఇంకా పూర్తిగా ఇవ్వలేదు. సైదాపురంలో కేటాయించిన స్థలాన్ని ఇంకా అభివృద్ధి చేయలేదు. ఇల్లు, భూములు కోల్పోయిన బాధితులకు సరైన నష్ట పరిహారం ఇవ్వడంలో, పునరావాసం కల్పించడంలోనూ జాప్యం జరుగుతోంది.

**ముంపు పరిహారం రూ.200 కోట్లు**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితుల పరిహారం పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.200 కోట్ల మేరకు నిధులు మంజూరు చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు.

# లక్ష్మీనారసింహుడికి పోచంపల్లి పట్టు వస్త్రాలు

- పూర్తయిన తయారీ ప్రక్రియ
- పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో నేడు ఆలయ అధికారులకు బహూకరణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణ మహోత్సవానికి స్వామి, అమ్మవార్లకు బహూకరించేందుకు పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలు తయారు చేయించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీటిని దేవస్థాన అధికారులకు అందజేయనున్నారు. ఏటా పోచంపల్లి మహాజన సంఘం ఆధ్వర్యంలో సనాతన ధర్మం ప్రకారం హరికి అత్తింటి వారు, సిరికి పుట్టింటి వారుగా పేరొందిన పద్మశాలి వశంస్తులు మి, అమ్మవార్లకు స్వయంగా పట్టువస్త్రాలను తయారు చేసి బహూకరిస్తున్నారు. 10 రోజులుగా పోచంపల్లిలో స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాల తయారీ ప్రక్రియను ఆదివారం రాత్రి పూర్తి చేశారు.

**రెండు పట్టు చీరలు, పట్టుపంచెలు..**

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవానికి అమ్మవారిని అలంకరించేందుకు రెండు పట్టుచీరలను తయారు చేశారు. అందులో ఒకటి మెరుగు రంగు కొంగుతో కూడిన హాఫ్‌వైట్ చీర, మరొకటి మెరూన్ రంగు కలిగిన కొంగు, చిలుకపచ్చ చీరను తయారు చేశారు. చీరలో చతురస్రాకార రాజస్థాన్ డిజైన్లు కలిగి, స్పన్, జరీ బార్డర్‌తో చీరను నేశారు. అలాగే స్వామి వారికి పట్టు పంచె, పట్టు శాలువాను తయారు చేశారు.

**పట్టు వస్త్రాలతో ప్రదర్శన**

బ్రహ్మోత్సవాల అంకురార్పణ రోజున సోమవారం పోచంపల్లిలోని శ్రీ మార్కండేశ్వరస్వామి ఆలయంలో పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భారీ ప్రదర్శన ఊరేగింపుతో యాదాద్రి దేవస్థానానికి వెళ్లి అధికారులకు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో స్వామివారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.


అమ్మవారికి బహూకరించనున్న చీరను తయారు చేస్తున్న చేనేత కళాకారుడు

**అదృష్టంగా భావిస్తున్నాం**



పద్మశాలీల ఇలవెల్పు అయిన శ్రీ లక్ష్మీనారసింహస్వామి, అమ్మ వార్లకు ఎమిదేళ్లగా పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను అందజేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ ఏడాది కూడా అమ్మవారికి రెండు ఇక్కత్‌పట్టుచీరలు, స్వామి వారికి పట్టుపంచె, శాలువా తయారు చేయించాం. సోమవారం పూజల అనంతరం ఊరేగింపుగా యాదాద్రి దేవస్థానానికి వెళ్లి పట్టు వస్త్రాలను బహూకరించనున్నాం.

– సీత శ్రీరాములు, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు

**12 రోజుల్లో నేశాను**



12 రోజుల్లో మగ్గంపై శ్రీ లక్ష్మీ నారసింహస్వామి, అమ్మవారికి రెండు పట్టు చీరలు, స్వామి వారికి పట్టు పంచె, శాలువా నేశాను. ఎంతో నియమ నిష్ఠలతో రోజుకు 10గంటలు మగ్గంనేసి వస్త్రాలను తయారు చేశా. ఈసారి రాజస్థాన్ నూతన డిజైన్‌లతో చీరలను తయారు చేశాను. సాక్ష్యాత్తు శ్రీ లక్ష్మీనర్సింహస్వామికి పట్టు వస్త్రాలను తయారు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

– మేకల రామకృష్ణ, చేనేత కళాకారుడు, భూదాన్‌పోచంపల్లి


తయారైన పట్టుచీరను చూపిస్తున్న పద్మశాలి మహాజన సంఘం నాయకులు


సిద్ధమైన పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరలు

# ముఖ్యమంత్రి రాకకు పటిష్ట ఏర్పాట్లు


హెలిప్యాడ్‌ను పరిశీలించి పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న విప్ ఐలయ్య, కలెక్టర్ జెండగే

యాదగిరిగుట్ట : సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులు, ఆరుగురు మంత్రులతో కలిసి బ్రహ్మోత్సవాలకు రానున్నారు. కల్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు. సీఎం రాక నేపథ్యంలో యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. పాతగోశాలలోని యాగ స్థలంలో హెలిపాడ్ ఏర్పాటు చేశారు. హెలిపాడ్‌ను కలెక్టర్ హనుమంత్ కే జెండగేతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం పరిశీలించారు. హెలిపాడ్ నుంచి కొండపైకి వెళ్లే మార్గాలను పరిశీలించారు. ప్రత్యేక కాన్వాయ్‌తో ట్రయల్ వేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**దర్శనాలు బంద్**

సీఎం రేవంత్‌రెడ్డి రాక నేపథ్యంలో ఉదయం 8 నుంచి 11గంటల వరకు కొండపైకి వచ్చే వాహనాలతో పాటు భక్తులకు కల్పించే దర్శనాలను నిలిపివేయనున్నట్లు ఈఓ వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు అల్పాహారంగా కట్టిపొంగలి, పులిహోర, దద్దోజనం, లడ్డూలు తయారు చేస్తున్నారు.

# స్వాతంత్ర్యానికి ముందు మూడ్రోజులు భక్తోత్సవాలు

- 1955లో యాదగిరిగుట్టలో 11రోజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


యాదాద్రి ఆలయంలో 1955 తరువాత బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతంత్ర్యానికి పూ ర్వం స్థానికులు మూడ్రోజులు భక్తోత్సవాలు నిర్వహించేవారు. అప్పట్లో కొండ ఎక్కేందుకు మెట్ల సదుపాయం కూడా అంతంత మాత్రమే. అయినా ఈ ప్రాంత వాసులు శ్రీస్వామిని ఆరాధించేందుకు ఎలాగో కొండెక్కేవారట. కొందరు భక్తులు ముందుకు వచ్చి తొలుత మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించారు. అప్పట్లో భక్తులు నిర్వహించవారు కాబట్టి.. వాటిని భక్తోత్సవాలనేవారు. కొన్నేళ్లు గడిచాక ఐదు రోజులకు పెంచారు. అప్పట్లోనే హైదరాబాద్, మహబూబ్‌నగర్, మహారాష్ట్ర, వరంగల్ వంటి ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా ఈ క్షేత్రానికి వచ్చేవారని పలువురు చెబుతుంటారు. కాలక్రమేణ శ్రీనారసింహుడిపై భక్తి పెరిగి ఉత్సవాలకు మార్గమేర్పడిందని చెబుతుంటారు. కీకారణ్యం, వసతులు లేని కాలంలో (సుమారు 1895) ప్రాంతంలో ఆ ఉత్సవాలు జరిగాయి. మార్గశిర మాసంలో ఆ సంబురాలు జరిగేవి. ఆ కాలంలో శ్రీస్వామి ఉత్సవాలు జరపడం సబబుకాదంటూ అప్పట్లోనే పూజారులు కొందరు పాల్గుణ మాసంలో 11 రోజుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయ్యాక అప్పటి ఆలయ కమిటీ పెద్దలు ఆచార్యులతో సంప్రదించి 1955లో 11 రోజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాటి నుంచి శ్రీస్వామి బ్రహ్మోత్సవాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

# సినిమా కథను తలపించిన నిర్మాత మృతి

- బతికుండగానే చనిపోయినట్లు మిర్యాలగూడలో ఫ్లెక్సీల ఏర్పాటు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరుసటి రోజు రాంబాబు మృతి
- ముగిసిన అంత్యక్రియలు


పాలిశెట్టి రాంబాబు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : పలు తెలుగు చిత్రాలను రూపొందించిన సినీ నిర్మాత పాలిశెట్టి రాంబాబు(58) మృతి చివరకు ఓ సినిమా కథను తలపించింది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాలిశెట్టి రాంబాబు మొదట ప్రజా నాట్యమండలి కళాకారుడిగా పనిచేశారు. ఆ తరువాత హైదరాబాద్‌కు చేరుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రాణించి సినీ నిర్మాతగా మారారు. అతడికి భార్య సంధ్యారాణి, ఇద్దరు కుమార్తెలున్నారు. తెలుగులో హీరో అల్లరి నరేష్‌తో గోపి గోడమీది పిల్లి, లక్ష్మీపుత్రుడు సినిమాలను నిర్మించారు. అయితే, కొంత కాలంగా కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. ఐదురోజుల పాటు చికిత్స పొందినా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అమెరికాలో ఉంటున్న ఆయన కుమార్తె గత శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకుంది. అదేరోజు మధ్యాహ్నం 3గంటల తరువాత వెంటిలేటర్ తొలగించారు. గంటల వ్యవధిలో రాంబాబు మరణిస్తారని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. విషయం బంధువులు, మిర్యాలగూడలో ఉన్న స్నేహితులకు తెలియడంతో ఆయన శుక్రవారం సాయంత్రం మృతిచెందినట్లు ప్రకటించి.. అదే రోజు రాత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులు కొన ఊపిరితో ఉన్న రాంబాబును శుక్రవారం రాత్రి మిర్యాలగూడకు తీసుకవచ్చి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. బతికే ఉన్నాడని సమాచారంతో శనివారం తెల్లవారుజామున పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. అయితే, శనివారం రాత్రి 8గంటల సమయంలో ఆయన తుది శ్వాస విడిచారు. శనివారం పట్టణంలో ఈ విషయంపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**పలువురి సంతాపం**

సినీ నిర్మాత పాలిశెట్టి రాంబాబు మృతదేహానికి దివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసంహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కాసుల సత్యం, వీరాచారితో సహా పలువురు నివాళులు అర్పించారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆయన నివాసానికి జనం భారీగా తరలి వచ్చారు. ఆయన మృతదేహానికి పెద్ద కుమార్తె అంజు చేతుల మీదుగా సాంప్రదాయ ప్రకారం హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

# ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5వ తేదీన ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో నిత్యహవనములు, శివ పంచాక్షరీ జపములు, నందీశ్వర పారాయణములు, పంచసూక్త పఠనం గావించారు. మూలమంత్ర జపములు, వివిధ పారాయణములు, మహాపూర్ణాహుతి జరిపించి, కొండపైన విష్ణు పుష్కరిణిలో త్రిశూల తీర్థ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పారాయణీకులచే స్తోత్ర, వేద, నమక, చమక పారాయణములు, మంత్రపుష్ప పఠనములు, సోమకుంభార్చనలు, మూలమంత్ర పారాయణములు జరిపించారు. రాత్రి శివపార్వతుల ఏకాంత శృంగార డోలోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, పూజారులు పాల్గొన్నారు.

# ఉత్కంఠగా సాగుతున్న ఎద్దుల పందేలు


బండ లాగుతున్న గిత్తలు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు ఆదివారం మూడో రోజూ ఉత్కంఠగా కొనసాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన నాలుగు బండ్ల విభాగంలోఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన శాఖమూరి విజయ్‌పవన్‌కు చెందిన ఎద్దులు మొదటి బహుమతి, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పు రావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావుకు చెందిన ఎద్దులు రెండో బహుమతి, పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన నందిపాటి శ్రీహరి, అభయరామ్‌కు చెందిన ఎద్దులు మూడో బహుమతి సాధించాయి. మొదటి బహుమతిగా హీరో స్ప్లెండర్ బైక్, రెండో బహుమతిగా రూ.50వేలు, మూడో బహుమతిగా రూ.40వేలు విజేతలకు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

### పాత కక్షలతో కత్తితో దాడి

నల్లగొండక్రైం: పాత కక్షలతో ముగ్గురు యవకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీకి చెందిన మేడబోయిన చక్రికి అదే ప్రాంతానికి చెందిన ప్రకాష్ అలియాస్ రాజుతో పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాలనీలో ప్రకాష్ కత్తి తీసుకుని వచ్చి చక్రిపై దాడి చేశాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న చక్రి సోదరుడు ఉపేందర్ దాడిని అడ్డుకున్నాడు. ఇరువర్గాల దాడిలో ఉపేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం ఉపేందర్‌ను హైదరాబాద్‌కు తరలించారు. మద్యం మత్తులోనే దాడులు జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


సాయిబాబా దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు


రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి: పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయాన్ని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం చింతపల్లి మండల కేంద్రంలో 2 కిలోమీటర్ల మేర హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి, మంత్రులందరూ కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ప్రాజెక్టులను మూడు సంవత్సరాలలో పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో ప్రతి తండా, గ్రామానికి రోడ్లు వేయించే బాధ్యత తనేదనని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కొండూరు భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, డీసీసీ ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, ఎరుకలి వెంకటయ్య గౌడ్, గడ్డం పురుషోత్తంరెడ్డి, ముచ్చర్ల యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, జితేందర్ రెడ్డి, గుండ్లపల్లి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

### ఆర్‌ఎంపీలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి చేయూతనిస్తాం


కొండమల్లేపల్లి: ఆర్‌ఎంపీ వద్ద బీపీ చెక్ చేయించుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి

కొండమల్లేపల్లి: చింతపల్లి మండలంలో ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని దేవరకొండకు వస్తూ కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. కొండమల్లేపల్లిలోని ఓ ప్రైవేట్ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో ఆర్‌ఎంపీ వద్ద మంత్రి బీపీ చెక్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్‌ఎంపీలను నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి చేయూత అందిస్తుందని తెలిపారు. కాగా తన చిన్నతనంలో ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దనే చికిత్స చేయించుకునేవాడినని గుర్తు చేసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీపీ రేఖారెడ్డి కొండమల్లేపల్లి మండల అభివృద్ధికి, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి వెంట దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఎంఏ సిరాజ్ ఖాన్, గంధం సురేష్ తదితరులున్నారు.

### ఉరేసుకుని ఆత్మహత్య

తుర్కపల్లి: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం మోతీరాం తండాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ చందు, సునీత దంపతులకు ముగ్గురు సంతనం అందరిలో చిన్నవాడు బానోత్ ప్రవీణ్ (22) ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ఇతను కొన్ని రోజుల నుంచి తండాలో క్యాటరింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. ప్రవీణ్ మధ్యాహ్న సమయంలో తండాలోనే ఉంటున్న స్నేహితుడి వద్దకు వెళ్లాడు. అతడి ఫోన్ తీసుకుని సెల్ఫీ తీసుకుని ఐ మిస్ యూ రా అని స్టేటస్ పెట్టాడు. అనంతరం మిత్రుడి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇచ్చి ఇంటికి వెళ్లిపోయాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఫోన్ రింగ్ అవుతున్నా ప్రవీణ్ లిఫ్ట్ చేయకపోవడంతో చుట్టు పక్కల వారు కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. లోపలికి వెళ్లి అతడిని కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.